## క్లుప్తంగా

### నర్సరీ పరిశీలన



పలిమెల: మండలంలోని లెంకలగడ్డ గ్రామ పంచాయతీలో హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీని గురువారం ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలంలో నర్సరీలో మొక్కలు చనిపోకుండా ప్రతి రోజు రెండు సార్లు నీళ్లు పట్టాలని, కలుపు మొక్కలు ఉంటే ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి తెలిపారు. పలు అంశాలపై ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రెటరీలకు సూచనలు చేశారు.

### విరాళం అందజేత



మల్హర్: మండలంలోని కొయ్యూరు అభయాంజనేయ ఆలయ నిర్మాణానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి రూ.5వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయ సన్నిధిలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు బాపురెడ్డి, రాజబాబురెడ్డి, మల్లారెడ్డి, నర్సారెడ్డి, శంకర్‌రెడ్డి, చింటు, దుర్గం మల్లయ్య, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### నియామకం



గణపురం: మండలంలోని కొండాపురం మత్స్య సహకార సంఘం ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా శ్రీనివాస్ రావు వ్యవహరించగా నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చాడ కిష్టస్వామి, ఉపాధ్యక్షులుగా శామంతుల కుమారస్వామి, కార్యదర్శిగా మామిడి చిరంజీవి, కార్యవర్గ సభ్యులుగా పాశం రాము, దొంతుల మహేందర్ తదితరులను ఎనుకున్నారు. నూతన కమిటీని జిల్లా మత్స్యశాఖ అధికారి రావిశెట్టి అవినాష్, ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బోయిని సాంబయ్య అభినందించి నియామకం పత్రం అందజేశారు.

### కూలీల సంఖ్య పెంచాలి

టేకుమట్ల: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ అనిత అన్నారు. గురువారం మండలంలోని ఆశిరెడ్డిపల్లిలోని ఊర చెరువులో కొనసాగుతున్న పూడిక తీత పనులను ఎంపీడీఓ పరిశీలించి మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉంది కావున ఉదయాన్నే పనులకు వచ్చి పనులు పూర్తి చేసుకోవాలన్నారు. కూలీలకు తగిన సౌకర్యాలను కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీ, పల్లె ప్రకృతి వనంలను పరిశీలించారు. ఆమె వెంట ఈసీ రాము, టీఏ మహేందర్, తదితరులు ఉన్నారు.

### పరామర్శ

చిట్యాల: మండలం లోని జూకల్ గ్రామానికి చెందిన ఎలమద్రి భిక్షపతి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ గొర్రె సాగర్ గురువారం పరామర్శించారు. భిక్షపతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఎంపీటీసీ జంబుల తిరుపతి, కొడారి రవి, ఉప సర్పంచ్ చాడ ఆనంద్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పిట్ట సురేష్, పీఏసీఎస్ డైరక్టర్ గుర్రం మహేందర్, నాయకులు స్వామీ దాస్, వెంకటేష్, రవి, నల్ల తిరుపతి రెడ్డి, కుసుంబా శ్రీను, ఎలమద్రి తిరుపతి, ఒదేలమల్లు ఉన్నారు.

# రానున్న రోజుల్లో బీజేపీదే అధికారం



ములుగు రూరల్: ఆవిర్భావ వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు

ములుగు రూరల్: రాష్ట్రంలో రానున్న రోజుల్లో బీజేపీదే అధికారం అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ వేడుకలను మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా చింతలపూడి భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండా ఆవిష్కరించారు. ముందుగా తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి, నియంతృత్వ, కుటుంబ పాలనను అంతమొందించేందుకు రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు సాగుతున్న పోరాటంలో భాగస్వామి అవుతానని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జనసంఘ్ నుంచి భారతీయ జనతా పార్టీ ఏర్పడి దేశ రాజకీయాలమలుపు తిప్పుతూ అనేక మంది కార్యకర్తలు కలిగిన పార్టీగా అవతరించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బలరాం, వాసుదేవరెడ్డి, మహేందర్, ఉత్తమ్‌కుమార్, రాకేష్‌రెడ్డి, కొత్త సురేందర్, పరమేశ్వర్, రవిరెడ్డి, విజయ్‌యాదవ్, రాజన్న, నాగరాజు, శ్రీనాథ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు అట్లూరి రఘురామ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంకా హేమ సుందర్, ఉప్పల కృష్ణమూర్తి, తంగెళ్ల పల్లి ప్రసాద్, బట్ట శేఖర్, మట్టి రమేష్, లక్ష్మిపతి, శ్రీకిషన్, అంకాల దుర్గ, వేల్పూరి సరిత, మాదాల సంతోష్,చిట్టెం ఈశ్వరావు, సర్వేశ్వరావు తదతరులు ఉన్నారు.

మంగపేట: మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆ పార్టీ మండల అధ్యక్షుడు లొడె శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ గిరిన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దన్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకూబ్‌పాషా, పార్టీ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం(కె)లో..



మంగపేట: బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న తాటి కృష్ణ

## ప్రశ్నపత్రాల లీకేజీ కారకులను శిక్షించాలి



మాట్లాడుతున్న ప్రవీణ్

ములుగు రూరల్: పదో తరగతి ప్రశ్న పత్రాల లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాస్తుంటే రాజకీయ దురుద్దేశ్యంలో ప్రశ్న ప్రశ్న పత్రాల లీకేజీలకు బీజేపీ నాయకులు పాల్పడడం సరికాదని అన్నారు. బీజేపీ నాయకులు అధికారం కోసం విద్యార్థుల భవిష్యత్ నాశనం చేయడం సరికాదని అన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునిల్, శంకర్, రవితేజ, బాలేశ్వర్, సుమంత్, శివకేశవ్, స్వామి, రాజ్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్

ఎస్ఎస్ తాడ్వాయి: తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్ గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. మండలంలోని భీరెల్లి కామారంలో తాగునీటి సమస్య ఉన్నట్లు ఆయన దృష్టికి రావడంతో గురువారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని తాగునీటి కొరత సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా తాగునీటి వసతి కల్పించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తితే సత్వరమే పరిష్కరించాలన్నారు. సర్పంచ్ జాజ చంద్రం, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

### 'కంటి వెలుగు'పై కళాజాతా

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సీ) గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమంపై తెలంగాణ సంస్కృతిక సారథి కళాజాతా ఆధ్వర్యంలో టీం లీడర్ ఎర్రన్న బృందం ఆటపాటలతో అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేశ్వరి, సంగీత, ఏఎస్ఎం సుమలత, జయలత, సంధ్య, ఆశా వర్కర్ సునీత, కమల, కృష్ణవేణి, ఐకేపీ సీసీ లలిత, కళాకారులు మంకాల యాకోబ్, దుప్పటి రవి, ఖలీల్ భాషా, స్వప్న, బండారి అనిత, కంచర్ల శ్యామల, గడ్డం రజిత తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి



పూజలు చేస్తున్న భక్తులు, అర్చకుడు సుదర్శనస్వామి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆలయ అర్చకులు సుదర్శనస్వామి ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం సాయిబాబా వెండి విగ్రహానికి పంచామృత అభిషేకాలను ఆలయ నిర్వాహకులు, భక్తులు చేపట్టారు. అష్టోత్రమ నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల నైవేద్యాలను బాబాకు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో పల్లెకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ బచ్చు సతీష్, ప్రధాన కార్యదర్శి కాతయాదగిరి, మంతెన బార్గవచారి, అటిక కృష్ణ, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత



ఏటూరునాగారం: బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ రాజు, ఎస్సై రమేష్



వెంకటాపురం(కె): పరీక్ష కేంద్రం వద్ద సీఐ శివ ప్రసాద్

ఏటూరునాగారం: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఏటూరునాగారం సర్కిల్ పరిధిలోని మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం పరీక్ష కేంద్రాల వద్ద చర్యలపై స్థానిక సీఐ రాజు ఎప్పటికప్పుడు వాకాబు చేస్తూ భద్రత ఏర్పాట్లు చేపట్టారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో జరుగుతున్న ఇంగ్లీష్ పరీక్ష సందర్భంగా ఆయన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ప్రధాన గేటు మూసివేసి పాఠశాల చుట్టూ పోలీసుల భద్రత ఏర్పాటు చేశారు. 144 సెక్షన్‌ను పక్కాగా అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గత రెండు పేపర్లు లీకేజీ కావడంతో పోలీసులు, విద్యాశాఖ అధికారులు నిఘాను పెంచారు. సిబ్బంది, ఇన్విజిలేటర్ల ఫోన్లను అనుమతి ఇవ్వలేదు. ఎస్సై రమేష్‌తోపాటు సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను సీఐ శివ ప్రసాద్, ఎస్సై తిరుపతి రావు గురువారం పరిశీలించారు. పరీక్ష కేంద్రల వద్ద విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నది లేనిది పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రత ఏర్పాట్లును చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎవరూ పరీక్షా కేంద్రంలోకి వెళ్లొద్దని తెలిపారు.

# బండి సంజయ్ అరెస్ట్ అప్రజాస్వామికం



పలిమెల: అరెస్ట్ అయిన నాయకులు

పలిమెల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ అప్రజాస్వామికం అని బీజేపీ మండల అధ్యక్షుడు కోయల్‌కార్ నిరంజన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సంజయ్ అక్రమ అరెస్టు నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీకి వస్తున్న ఆదరణ చూడలేకనే కేసీఆర్ బండి సంజయ్‌ని అక్రమంగా అరెస్టు చేసి రాక్షస ఆనందం పొందుతున్నారన్నారు. లిక్కర్ స్కాములు, పేపర్ల లీకేజీల నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకే సంజయ్ అరెస్టు చేశారని ఆరోపించారు. అనంతరం ధర్నాను అడ్డుకున్న పోలీసులు బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బాలు, ఉపాధ్యక్షులు సదానందం, మైనార్టీ నాయకులు ఎస్‌కే నవాబ్, బూత్ అధ్యక్షులు చెన్నూరు సమ్మయ్య, నాయకులు గోనె రంజిత్, నరేష్, చంద్రశేఖర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కాటారం: బండి సంజయ్ అరెస్ట్ రాష్ట్ర ప్రభుత్వ పిరికిపంద చర్య అని బీజేపీ జిల్లా నాయకుడు మోలుమూరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ తాటాకు చప్పుళ్లకు బీజేపీ నాయకులు భయపడరని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పరిణామాలకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీల్

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు సర్పంచ్ ఇర్ప సునీల్, ఉప సర్పంచ్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మట్టి రోడ్లకు సీసీ రోడ్ల నిర్మాణంతో మహర్దశ లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ఇర్ప జగన్, నాయకులు ఆలేటి మహిపాల్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, గౌని మధు, బంగారు శ్రీనివాస్, ఇర్ప సారంగపాణి ఉన్నారు.

### చేయూత

మొగుళ్లపల్లి: అనారోగ్యంతో నాడు తల్లి, నేడు తండ్రి మృతి చెందగా ఇద్దరు పిల్లలు అనాథలవడంతో ఎంపీటీసీ ఎర్రబెల్లి వనిత పూర్ణచందర్‌రావు చేయూతనందిచాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన చెక్క శంకర్ దంపతులు కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వారు. కాగా గతంలో శంకర్ భార్య అనారోగ్య కారణాలతో మృతిచెందింది. అప్పటి నుంచి శంకర్ కూలీ పనులు చేసుకుంటూ తన కుమారుడు అభిరాం (14), కుమార్తె రమ్య (16) లను చదివిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో శంకర్ కూడా అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలిపోయారు. దీంతో ఎంపీటీసీ ఎర్రబెల్లి వనిత పూర్ణచందర్‌రావు అనాథలైన ఆ ఇద్దరు పిల్లలకు రూ.5000 తక్షణ సాయంగా అందించి పైచదువులకు ఆర్థిక సాయం అందిస్తానని మనోధైర్యం కల్పించారు.

# కంటి పరీక్షలు చేయించుకోవాలి



పలిమెల: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ బుచ్చక్క



భూపాలపల్లి రూరల్: మోరంచపల్లిలో..

పలిమెల: కంటి వెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ బుచ్చక్క అన్నారు. మండలంలోని సర్వాయిపేట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని కంటి పరీక్షలు చేయించుకొని అవసరమైన వారు కంటి అద్దాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమ్మక్క, ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీధర్, హెల్ సిబ్బంది, సెర్ప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మోరంచపల్లి సర్పంచ్ లకిడె కమలబాయి తెలిపారు. భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్ కుమార్, మెడికల్ ఆఫీసర్ కార్తీక్, సీహెచ్ఓ రాజయ్య, వైద్య సిబ్బంది, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు లకిడె వెంకన్న, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం

భూపాలపల్లి రూరల్: విద్యార్థుల జీవితాలతో సీఎం కేసీఆర్ చెలగాటం అడుతున్నాడని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. పోలీసుల అదుపులో ఉన్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిని వెంటనే విడుదల చేయాలని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. చివరికి విద్యార్థుల జీవితాలతో కూడా కేసీఆర్ కుటుంబం సొమ్ము చేసుకుంటుందని విమర్శించారు. శివసేనారెడ్డిని విడుదల చేసేంత వరకు పోరాటాన్ని ఆపేదిలేదన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కాటారం: రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో బైక్‌యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధివిధానాలతో రాజ్యాంగానికి పెను ప్రమాదం పొంచి ఉందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని తొలిగించి మనుధర్మాన్ని తీసుకురావాలని బీజేపీ ప్రభుత్వం కుట్రపన్నుతుందని ఆరోపించారు. ప్రజలను చైతన్యం చేయడంలో భాగంగా బైక్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి గుర్రం దేవేందర్, శ్రీకాంత్ ఉన్నారు.

# వైభవంగా హనుమాన్ జయంతి



కాటారం: హోమం నిర్వహిస్తున్న పురోహితులు



మల్లారంలో పూజలు చేస్తున్న స్వాములు



కాళేశ్వరంలో..

కాటారం: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు ఆనందధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం, ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తాత్రేయ స్వామి ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవచనము, 51 కళశాలతో పంచామృత అభిషేకము, అష్టోత్రము, మన్యసూక్త, రుద్రసూక్త హోమం, బలిప్రదానము, మహాపూర్ణాహుతి, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలను సందర్శించి స్వామి వార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో భజన కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పురోహితులు మాడుగుల నాగరాజుశర్మ, గుండు భానుప్రసాద్‌శర్మ, నిఖిల్‌శాస్త్రి, కృష్ణమోహన్‌శర్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆలయ అర్చకుడు మాడుగుల బాపుశర్మ, పవన్‌శర్మల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి మాల విరమణ చేశారు. దీంతో ఆలయంతో పాటు గోదావరి తీరంలో మాల విరమణ భక్తులతో సందడిగా మారింది. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించారు.

మల్హర్: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని మల్లారం, కొయ్యూర్ హనుమాన్ ఆలయాల్లో భక్తులు, అంజన్న దీక్ష స్వాములు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో విగ్రహానికి చందనం వేసి తమలపాకులు నైవేద్యంగా సమర్పించారు. అంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర స్తోత్ర పూజలు నిర్వహించి, మొక్కలు చెల్లించుకున్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జిల్లా అడిషనల్ కలెక్టర్ దివాకరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వేసవిలోగా చేపట్టాలని, నూతన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. జీఓ నంబర్ 317 ద్వారా దూర ప్రాంతాలకు వెళ్లిన బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, హెల్త్ కార్డ్స్ అన్ని ఆస్పత్రిల్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. జిల్లా కేంద్రాలలో జీపీఎఫ్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తిరుపతి, వెంకటరామిరెడ్డి, మహేందర్, కరుణాకర్, రమణారెడ్డి, రమేష్, దిలీప్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R): 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O): 8074606274